# ఊరూరా.. ఉగాది సందడి

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- పంచాంగ పఠనం చేసిన అర్చకులు



ఆదోని మండలం నాగలాపురంలో ఆంజనేయస్వామి రథోత్సవం

కర్నూలు కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఊరూరా.. ఉగాది సందడి నెలకొంది. 'శ్రీ విశ్వావసు' నామ తెలుగు సంవత్సర ఆరంభ వేడుక...తెలుగు వారికి అత్యంత ప్రీతికరమైన పండుగ 'ఉగాది'ని ఆదివారం ఉమ్మడి జిల్లా వాసులు ఘనంగా నిర్వహించుకున్నారు. తెలుగు కాలమానం ప్రకారం తొలి సంవత్సరంలో అన్నీ శుభాలే వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు పండుగ కళ కానవచ్చింది. మరోవైపు ఆదివారం సెలవు రోజు కావడంతో అన్ని వర్గాల వారు వేకువ జాము నుంచే వేడుక నిర్వహణకు సన్నద్ధమయ్యారు. ప్రజలు తమ గృహ ద్వారాలను బంతిపూలతో ప్రత్యేకంగా అలంకరించి, మామిడి ఆకుల తోరణాలు కట్టి, ఉగాది లక్ష్మిని తమ ఇంటికి ఆహ్వానించారు. తీపి, చేదు, వగరు, పులుపు, ఉప్పు, కారంతో చేసిన షడ్రుచుల ఉగాది పచ్చడిని, పిండి వంటలను నైవేద్యంగా అమ్మ వారికి సమర్పించారు. ఆతర్వాత సంప్రదాయ పద్ధతిలో ఉగాది పచ్చడిని స్వీకరించారు. సాయంత్రం నూతన వస్త్రాలు ధరించి, సమీపంలోని దేవాలయాలకు, ధార్మిక క్షేత్రాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పంచాంగ పఠన కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ ఏడాది వ్యవసాయం, వర్షాలు, గ్రహస్థితులు, దేశ కాలమాన పరిస్థితులను, తమతమ రాశుల ఫలితాలను పంచాంగ పఠన కర్తల ద్వారా వింటూ వేడుకలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉగాది పర్వదిన సందర్భంగా వివిధ ఆలయాల్లో ఉగాది పచ్చళ్లను పంపిణీ చేశారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఉగాది పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఆయా గ్రామాల్లోని గ్రామ దేవతల ఆలయాలకు వెళ్లి ఉదయాన్నే పూజాది కార్యక్రమాలు చేపట్టారు. ఆలయాలు భక్తులతో కిక్కిరిపోయాయి. ఇండ్లలో కుటుంబ సమేతంగా ఉగాది పచ్చళ్ళు, పలు రకాల పిండి వంటలు చేసుకుని వేడుకలను ఆనందంగా జరుపుకొన్నారు. తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా ఈ ఏడాది ఉగాది వేడుకలు వైభవంగా సాగాయి. ఒకవైపు గ్రీష్మతాపం తీవ్రంగా ఉన్నా, ఆలయాల వద్ద భక్తుల సందడి బాగా కనిపించింది. ఉమ్మడి జిల్లాలోని ప్రసిద్ధ ఆలయాలు వివిధ ప్రాంతాల నుంచీ విచ్చేసిన యాత్రికులతో కిటకిటలాడాయి.



పేట శ్రీరామాలయంలో పంచాంగం వినిపిస్తున్న మాళిగి హనుమేశాచార్యులు

# ఉగాది శుభాలను తీసుకురావాలి

- పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తాం
- మంత్రి టీజీ భరత్



పంచాంగం వినిపిస్తున్న పండితుడు

కర్నూలు కలెక్టరేట్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): శ్రీ విశ్వావసునామ నూతన సంవత్సరం ప్రజలందరికీ శుభాలను తీసుకురావాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ ఆకాంక్షించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శ్రీ విశ్వావసునామ సంవత్సరం ఉగాది ఉత్సవాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ దావోస్ పర్యటన అనంతరం ఈ మధ్యన రెండు ముఖ్యమైన పారిశ్రామిక ప్రాజెక్టులు జిల్లాలో ఏర్పాటు చేసేందుకు కృషి చేశామన్నారు. త్వరలోనే వాటిని గ్రౌండింగ్ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పింఛన్ పంపిణీ, సీసీ రోడ్ల నిర్మాణం తదితర విషయాల్లో జిల్లాను మొదటి స్థానంలో ఉంచామన్నారు. ఈ సంవత్సరం వృద్ధి రేటు 11.56 శాతం వచ్చిందన్నారు. ఈ విశ్వావసునామ సంవత్సరంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్దేశించిన లక్ష్యం మేరకు 16 శాతం సాధించేలా ప్లాన్ చేసుకున్నామన్నారు. జిల్లాను ప్రగతి పథంలో నడిపేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉగాది, రంజాన్, క్రిస్మస్ తదితర పండుగల సందర్భంలో మన ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతి రానున్న తరాలకు తెలియజేసేలా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. పంచాంగ పఠన కార్యక్రమాన్ని నిర్వహించారు.

**11 మందికి ఉగాది పురస్కారాలు:** ఉగాది సందర్భంగా ప్రభుత్వం వివిధ రంగాలకు చెందిన వారికి పురస్కారాలు అందించింది.

- **వ్యవసాయ శాఖ :** గూడూరులోని రైతు పెద్ద గొల్ల ఎల్లప్ప.
- **విద్యారంగం:** పత్తికొండ మండలం జేఎం తండా ఎంపీపీ స్కూల్‌లో పని చేస్తున్న ఎం. కళ్యాణి కుమారి.
- **నాటక రంగం:** నాటకాల్లో అనేక పాత్రలు పోషించిన శ్రీనివాసరెడ్డి
- **ఉద్యాన పంటల సాగు:** తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండిస్తూ అధిక దిగుబడులు పొంది ఇతర రైతులకు మార్గదర్శకులుగా నిలిచిన దేవనకొండ మండలంలోని బేతపల్లి గ్రామ రైతు కనాపురం సుంకన్న.
- **సాహిత్యం:** మొట్టమొదటిసారిగా బ్రెయిలి లిపిలో భగవద్గీతను అనువదించి జిల్లా లైబ్రరీ సంస్థ నుంచి అవార్డు కూడా పొందిన ఆలూరు మండలం హులేబేడులోని ప్రభుత్వ ప్రైమరీ స్కూల్‌లో పని చేస్తున్న బీటీ లక్ష్మన్న.
- **శాస్త్రీయ నృత్యం:** కూచిపూడి అధ్యాపకుడు గంగాధరం.
- **శాస్త్రీయ వాయిద్యం:** నాద స్వర విద్యాంసులు పలు కచేరీలలో ప్రతిభ చాటుకున్న గణేష్.
- **క్రీడారంగం:** రన్నింగ్ క్రీడలలో 2024లో ఈజిప్టులో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలలో మూడోస్థానం పొందిన బంగ చరణ్‌తేజ.
- **రక్తదానం:** 102 సార్లు రక్తదానం చేసిన సామాజిక సేవాకర్త జి. బసవేశ్వర బాబ్జి
- **పాడి పరిశ్రమ:** 12 బుర్ర గేదెలతో 6 ఆవులతో రోజుకు 100 లీటర్ల పాటు ఉత్పత్తి చేసి అందరికి ఆదర్శంగా నిలిచిన ఎస్. తులసిరెడ్డి.
- **కళారంగం:** లలిత సంగీతంలో ప్రతిభా చాటిన సరస్వతి...

వీరికి ఉగాది పురస్కారాలను మంత్రి ప్రదానం చేశారు. అంతకు ముందు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, డీఆర్వో సీ. వెంకటనారాయణమ్మ, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



ఉగాది పురస్కారం అందజేస్తున్న మంత్రి టీజీ భరత్, కలెక్టర్ రంజిత్ బాషా



నృత్యం చేస్తున్న కళాకారులు



కోడుమూరులో వల్లెలాంబదేవి రథోత్సవం



కర్నూలులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్

# రమణీయం.. శ్రీశైలేశుడి రథోత్సవం

- తరలివచ్చిన అశేష భక్తజనం
- శివనామ స్మరణతో మార్మోగిన శ్రీగిరి



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

శ్రీశైలం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో ఉగాది మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన దేవదేవుల రథోత్సవం రమణీయంగా సాగింది. ఉభయ దేవాలయ ప్రాంగణంలో విశేష అర్చనలు, హారతులందుకున్న స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో రాజగోపురం మీదుగా రథశాల వద్దకు మేళ తాళాలు, భజంత్రీల మధ్య నడుమ తీసుకొచ్చారు. గంగాధర మండపం నుంచి నంది మండపం దాకా, అక్కడి నుంచి తిరిగి గంగాధర మండపం వరకు రథోత్సవం సాగింది. రథంపై ఆదిదేవులు ఆసీనులై ముందుకు సాగుతుండగా భక్తుల శివ నామస్మరణతో శ్రీగిరి క్షేత్రం మార్మోగింది. రథం ముందు కోలాటం, కర్నాటక జాంజ్, వీరగాసి, కొమ్ము వా యిద్యం, నందికోలుసేవ, బీరప్పడోలు, పగటివేశధారణ ప్రదర్శ నలు భక్తులను ఎంత గానో ఆకట్టుకున్నాయి. రమావాణి సేవిత రాజరాజేశ్వరి అలంకారంలో అమ్మ వారు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో చివరి రోజు సోమవారం నిజాలం కరణలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు అశ్వవాహన సేవ నిర్వహించనున్నారు.


# సన్మార్గం చూపే రంజాన్

- ముగిసిన రోజా ఉపవాస దీక్షలు
- నేడు 'ఈద్-ఉల్-ఫితర్



కర్నూలు కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): దైవిక భావనలతో, ధార్మిక చింతనలతో గడుపుతూ... 30 రోజుల పాటు రోజా ఉపవాస దీక్షలు, నిత్యం నమాజుల తర్వాత సోమవారం 'ఈద్- ఉల్-ఫితర్' (రంజాన్) పండుగ ను జిల్లా ప్రజలు నిర్వహించుకోనున్నారు. ఆదివారం సాయంత్రం ఇఫ్తార్ సమయంలో ఉపవాస దీక్షలను ముగించారు. అనంతరం నెలవంక దర్శనంతో ఆనందోత్సా హాల మధ్య 'ఈద్-ఉల్-ఫితర్' (రంజాన్) వేడుకలు జరుపుకునేందుకు సన్నద్ధమయ్యారు. ఉమ్మడి జిల్లాలో రంజాన్ రోజున ఉదయం ఆయా ప్రాంతాల్లోని ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం ఆనవాయితీ. కాగా జిల్లాలోని ఈద్గాలను శుభ్రం చేసి, షామియానాలు, మంచినీటి వసతి కల్పించారు. నందాల, ఆదోని, ఎమ్మి గనూరు, డోన్, పత్తికొండ, నందికొట్కూరు, ఆత్మకూరు, బనగానపల్లె తదితర పట్టణాల్లో రంజాన్ ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు.

# పల్లెల దాహానికి మిగులు వాటా నీరు




తుంగభద్ర డ్యాం నుంచి నదికి నీటి విడుదల

- టీబీ డ్యాం నుంచి నదికి 5వేల క్యూసెక్కులు విడుదల
- వేసవిలో ఎల్లెల్సీ ఆధునికీకరణ పనులకు శ్రీకారం
- ఏప్రిల్ 15 తరువాత నీళ్లివ్వలేమని తేల్చి చెప్పిన తుంగభద్ర బోర్డు ఇంజనీర్లు
- నీటి విడుదలకు సీఈ కబీర్ బాషా ప్రత్యేక చొరవ

కర్నూలు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా పశ్చిమ ప్రాంతం కరువు పల్లెసీమల ప్రాణాధారం తుంగుభద్ర దిగువ కాలువ (టీబీపీ ఎల్లెల్సీ). ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో 1.51 లక్షల ఎకరాలకు సాగునీరు, ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపల్ పట్టణాలతో పాటు 195 గ్రామాలకు తాగునీరు అందించే ఎల్లెల్సీ కాలువకు తుంగభద్ర డ్యాం నుంచి 24 టీఎంసీలు నీటివాటా ఉంది. 2024-25 నీటి సంవత్సరంలో డ్యాం చేరిన వరద నీటిని అంచనా వేసి కేడబ్ల్యూడీటీ-1 (బచావత్ అవార్డు) దమాషా మేరకు 22.30 టీఎంసీలు కేటాయించారు. ఎల్లెల్సీ సీసీ లైనింగ్ పనులు చేపట్టాల్సి ఉండడంతో ఏప్రిల్ 15 వరకు నీటిని విడుదల చేస్తామని, ఆ తరువాత ఎట్టిపరిస్థితుల్లో నీటిని ఇవ్వలేమని, ప్రత్యామ్నాయం చూసుకోవాలంటూ టీబీపీ బోర్డు అధికారులు లేఖ రాశారు. ఏప్రిల్ 15 వరకు ఎల్లెల్సీ వాటాలో 20 టీఎంసీలు వినియోగించుకొనే అవకాశం ఉంది. 2.07 టీఎంసీలు మిగులు వాటా ఉంటుంది. ఆ తరువాత వాడుకునే పరిస్థితి ఉండదని ఇంజనీర్లు అంచనా వేశారు. అదే సమయంలో తుంగభద్ర నది ఒట్టిపోవడంతో నదితీర గ్రామాల్లో అప్పుడే తాగునీటి సమస్యలు తలెత్తున్నాయని, నదికి నీటిని విడుదల చేయాలంటూ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి ఇరిగేషన్ ఇంజనీర్ల దృష్టికి తీసుకెళ్లారు. ఎల్లెల్సీ మిగులు వాటా నీటిని వినియోగించుకుంటే నదితీర గ్రామాలతో పాటు కర్నూలు నగరం తాగునీటికి ఇబ్బందులు ఉండవని ఉమ్మడి కర్నూలు జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ సీఈ కబీర్‌బాషా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానా యుడు, ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. వారితో చర్చించి ఎట్టకేలకు ఒప్పించారు.

తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) ఆధునికీకరణ పనుల్లో భాగంగా ఆర్‌సీసీ లైనింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. వైసీపీ హయాంలోనే టెండర్లు పూర్తి చేశారు. ఈ వేసవిలో లైనింగ్ పనులు చేసేందుకు ఇంజనీర్లు సన్నాహాలు చేస్తున్నారు. పనులు మొదలైతే ఎల్లెల్సీ కాలువకు నీటి విడుదల సాధ్యం కాదు. ఏప్రిల్ 15న నీటి విడుదలను ఆపేస్తున్నామని, అప్పటిలోగా ఎల్లెల్సీ వాటా జలాలు వాడుకోవాలని, ఆ తరువాత ఇచ్చేది లేదని తుంగభద్ర బోర్డు ఇంజనీర్లు తేల్చేశారు. రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులకు అధికారికంగా లేఖ కూడా రాశారు. ఏప్రిల్ 15 వరకు నీళ్లు వాడుకున్నా.. 2.07 టీఎంసీల మిగులు వాటా ఉంటుంది. దీంతో జలవనరుల శాఖ కర్నూలు ప్రాజెక్ట్స్ చీఫ్ ఇంజనీరు (సీఈ) కబీర్‌బాషా ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వంతో చర్చించి జిల్లాలో తుంగభద్ర నదీతీర గ్రామాలకు తాగునీటి కోసం టీబీపీ డ్యాం నుంచి విడుదల చేసేందుకు ఒప్పించారు. ఆదివారం 5 వేల క్యూసెక్కులను డ్యాం నుంచి తుంగభద్ర నదికి విడుదల చేశారు.



ఎల్లెల్సీ కాలువ

## డ్యాం నుంచి నదికి 5 వేల క్యూసెక్కులు

రోజుకు 5 వేలు క్యూసెక్కుల చొప్పున ఏప్రిల్ 2వ తేది వరకు తుంగభద్రకు విడుదల చేయాలని జిల్లా ఇరిగేషన్ ఇంజనీర్లు ఇండెంట్ ఇచ్చారు. ఆదివారం 5 వేల క్యూసెక్కులు నదికి విడుదల చేశారు. 2వ వరకు 1.728 టీఎంసీలు విడుదల చేసినా.. ఎల్లెల్సీ వాటాగా డ్యాంలో 0.341 టీఎంసీలు నిల్వ ఉంటుందని, అత్యవసరం పరిస్థితుల్లో ఎల్లెల్సీ ద్వారా తీసుకునే అకాశం ఉందని ఇంజనీర్లు తెలిపారు. ప్రస్తుతం సుంకేసుల డ్యాంలో 290.30 అడుగుల లెవల్‌లో 0.631 టీఎంసీలు నిల్వ ఉంది. డ్యాం నుంచి విడుదల చేసిన నీటిలో 0.600 టీఎంసీలు సుంకేసులకు చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అంచనా మేరకు నీరు చేరితే సుంకేసుల బ్యారేజీలో గరిష్ట సామర్థ్యం 1.200 టీఎంసీలకు చేరుతుందని, కర్నూలు నగరానికి ఈ ఏడాది తాగునీటి సమస్యే ఉండదని ఇంజనీర్లు పేర్కొంటున్నారు.

## సెరికల్చర్ అసిస్టెంట్లకు పదోన్నతి

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో సెరికల్చర్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న 11 మందికి పదోన్నతి కల్పిస్తూ ఆ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి దాకా వీరు పంచాయతీరాజ్ ఆజమాయిషీలో పని చేస్తున్నారు. టెక్నికల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించడంతో వీరంతా పట్టుపరిశ్రమశాఖ పరిధిలోకి రానున్నారు. టెక్నికల్ అసిస్టెంట్లను నాగలింగం, శ్వేతను నంద్యాల సెరికల్చర్ విభాగానికి బదిలీ చేయగా.. అరవింద్, కలాం, రాజేశ్వరి, పుల్లయ్యను ఆత్మకూరు ఏడీకి అటాచ్ చేశారు. మాధవీలత, శివతేజ, సావిత్రి, మోహన్ ప్రసాద్, శివతేజ, పుల్లయ్యలను కర్నూలు సెరికల్చర్ విభాగానికి బదిలీ చేశారు.

## బియ్యం గింజపై రంజాన్ చిత్రాలు

నంద్యాల కల్చరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్ర కారుడు చింతలపల్లె కోటేష్ రంజాన్ పర్వ దినం సందర్భంగా బియ్యపు గింజపై అతి సూక్ష్మ చిత్రాలు వేశారు. భక్తుడు అల్లా కు ప్రార్థన చేస్తున్నట్లు, నెల వంక, నక్షత్రం వున్నట్లు చిత్రీకరించా రు. మైక్రో బ్రష్ ద్వారా ఈ చిత్రం వేసినట్లు చిత్రకారుడు కోటేష్ తెలిపారు.





బియ్యం గింజపై రంజాన్ చిత్రాలు

## డిగ్రీ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూని వర్సిటీ పరిధిలో డిగ్రీ 1,3,5 సెమిస్టర్ రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షల ఫలితాలను పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు విడుదల చేశారు. మరిన్ని వివరాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచామని తెలిపారు.

## రిజిస్ట్రేషన్‌కు స్లాట్ బుకింగ్ సౌకర్యం

- కర్నూలు జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 2 నుంచి అమలు
- స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ ఉత్తర్వులు జారీ

కల్లూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కర్నూలు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లను సరళతరం చేసేందుకు స్లాట్ బుకింగ్ సౌకరాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈమేరకు స్టాం పులు రిజిస్ట్రేషన్ శాఖ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారని కర్నూలు సబ్ రిజిస్ట్రార్ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం ప్రజలు తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా కోరుకున్న సమయానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియను ముగించుకునేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారని తెలిపారు. స్లాట్ బుకింగ్ వినియోగదారులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని వారు కోరుకున్న రోజున నిర్దిష్ట సమయానికి ఆన్లైన్ ద్వారా ఈ-స్లాట్ బుక్ చేసుకునే అవకాశం కల్పించిందన్నారు. ప్రతి రోజూ రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ సమయం ఉదయం 10.30 నుండి సాయంత్రం 5.30 గంటల వరకు ఉంటుందన్నారు.

## సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య

ఆదోని, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కపటి గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ మధు (26) ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల మేరకు.. పట్టణంలోని శ్రీనివాసనగర్ కాలనీకి చెందిన నారాయణరావు, సరోజబాయి దంపతుల చిన్న కుమారుడు మధు కపటిలో విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం విధులు ముగించుకొని ఇంటికి వచ్చి రాత్రి భోజనం అనంతరం ఇంటి పైన ఉన్న గదిలో నిద్రించాడు. రోజూ తెల్లవారుజామున లేచే తమ కుమారుడు ఆదివారం ఉదయం 9.30లకు కూడా కిందకు రాకపోవడంతో తల్లిద్రండులు వెళ్లి కిటికీలో నుంచి చూడగా, ఫ్యానుకు ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే త్రీ టౌన్ సీఐ రామలింగయ్యకి సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. తండ్రి నారాయణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## పోలీసుల కృషి అభినందనీయం

**ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా**



పరిశీలిస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

శ్రీశైలం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైలం ఉగాది మహోత్సవాల బందోబస్తులో పోలీసు అధికారులు, సిబ్బంది కృషి అభినందనీయమని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉగాది ఉత్సవాలకు బందోబస్తుకు వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలు జరుగకుండా నిర్విరామంగా కృషి చేశారని అన్నారు.

**ఆలయం క్యూలైన్లు కంపార్ట్మెంట్లు పరిశీలించిన ఎస్పీ**

శ్రీశైలంలో ఉగాది మహోత్సవాల సందర్భంగా ఆదివారం నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయం పరిసరాలు, భక్తులు వేచివుండు కంపార్ట్మెంట్లు, క్యూలైన్లను పరిశీ లించి అక్కడ ఉన్న సిబ్బందికి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదే శించారు.

# ఉమ్మడి జిల్లాకు ఉగాది పురస్కారాలు

- కళారత్న (హంస) పురస్కారం అందుకున్న పత్తి ఓబులయ్య
- ఉగాది విశిష్ట పురస్కారం పొందిన డాక్టర్ ఎం. హరికిషన్, ఎస్‌డీవీ అజీజ్



సీఎం చంద్రబాబు నుంచి అవార్డులు అందుకుంటున్న పత్తి ఓబులయ్య, ఎస్‌డీవీ అజీజ్, హరికిషన్

కర్నూలు కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఉగాది పర్వదిన సందర్భంగా కవులు, కళాకారులకు అందించే ఉగాది కళారత్న (హంస), ఉగాది విశిష్ట పురస్కారాలను ఈసారి జిల్లాకు చెందిన పత్తి ఓబులయ్య, సాహితీవేత్తలు డాక్టర్ ఎం. హరికిషన్, ఎస్‌డీవీ అజీజ్ అందుకున్నారు. ఆదివారం ఉదయం విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో, రాష్ట్ర దేవదాయ శాఖ, పర్యాటక శాఖ, భాషా సాంస్కృతిక వ్యవహారాల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరై ఈ పురస్కారాలు అందజేశారు. నాటక రంగంలో కర్నూలుకు చెందిన టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, నంది అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్యకు ప్రతిష్టాత్మక కళారత్న (హంస) పురస్కారం ముఖ్యమంత్రి అందజేశారు. ఆయనకు హంస ప్రతిమతోపాటు, రూ.50 పారితోషికాన్ని అందజేసి, శాలువతో సత్కరించారు. అలాగే సాహితీ రంగంలో విశేషంగా సేవలు అందిస్తున్న డాక్టర్ ఎం. హరికిషన్, ఎస్‌డీవీ అజీజ్‌లకు ఉగాది విశిష్ట పురస్కారాలు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రదానం చేశారు. వారికి తెలుగు తల్లి ప్రతిమతోపాటు రూ.10 వేలు నగదు అందజేశారు.

## ఎస్ఆర్ఎస్ ప్రసాద్‌కు హంస పురస్కారం



ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఎస్ఆర్ఎస్ ప్రసాద్

నంద్యాల కల్చరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన కళాకారుడు ఎస్ఆర్ఎస్ ప్రసాద్‌కు విజయవాడలో ఆదివారం ఉగాది ఉత్సవాలలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కళారత్న హంస పురస్కారం అందించారు. గోల్డ్‌కలర్ హంస, 50వేల రూపాయలు చెక్కు, సర్టిఫికెట్‌ను ఆయనకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాకారుడు ఎస్ఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ కళాకారులకు పూర్వవైభవం వచ్చిందన్నారు. ఈ సందర్భంగా నంద్యాలలోని ప్రముఖులు, కళారాధన నిర్వాహకులు డాక్టర్ రవిక్రిష్ణ, డాక్టర్ మధుసూదనరావు, కళాకారులు, తోటి మిత్రులు ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

# నేడు పిడకల సమరం

- ఆస్పరి మండలం కైరుప్పలలో ఉగాది ప్రత్యేకత
- ఆలయ ప్రాంగణంలో సమరానికి సిద్ధంగా ఉంచిన పిడకలు
- సమరం.. గ్రామస్థులకు సంబరం



సమరానికి సిద్ధం చేసిన పిడకలు

ఆదోని/ఆస్పరి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పండుగకు ఆస్పరి మండలంలో ఓ ప్రత్యేకత ఉంది. పండుగ మరుసటి రోజైన సోమవారం కైరుప్పల గ్రామంలో పిడకల సమరం నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. కైరుప్పల గ్రామంతో పాటు సమీప గ్రామాలైన పుష్పాలదొడ్డి, చెన్నంపల్లి, వెంగళాయదొడ్డి, కారుమంచి, కలపరి, యాటకల్లు గ్రామాల ప్రజలు రెండు వర్గాలుగా ఏర్పడి పిడకలతో కొట్టుకోవడం, అనంతరం కలిసిపోవడం అనవాయితీగా వస్తున్న వేడుక. చాలా ఏళ్లుగా కొనసాగిస్తున్న ఈ పిడల సమరాన్ని తిలకించేందుకు మండలంలోని గ్రామాల ప్రజలతో పాటు ఇతర రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు తరలి వస్తారు. శ్రీ వీరభద్ర స్వామి, భద్రకాళి ప్రేమాయణంలో తలెత్తిన ఓ చిన్న వివాదానికి గుర్తుగా దీన్ని జరుపుకుం టారు. ఉదయం ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ ప్రాంగణంలో గ్రామస్తులు పిడకలను సిద్ధం చేసుకుంటారు. సాయంత్రం పుష్పాలదొడ్డి, చెన్నపల్లి గ్రామస్తులు తమ గ్రామ దేవుళ్లను పల్లకిలో కైరుప్పలకు తీసుకొస్తారు. కొద్దిసేపటికే కారుమంచి రెడ్డి తన మంది మార్బలంతో ఆలయ ప్రాంగణంలోనికి ప్రవేశించగానే రెండు వర్గాల వారు పిడకలను ఒకరిపై ఒకరు విసురుకుంటారు. ఈ పిడకల సమరం దాదాపు గంటపాటు సాగుతుంది. చివరకు విజయ దరహాసంతో వీరభద్రస్వామి ఆలయం చేరుకోవడంతో ఈ సంబరం ముగుస్తుంది.



వీరభద్ర స్వామి



కాళికాదేవి

# ఉగాది ప్రత్యేకం ... ఎడ్ల బండ్ల ప్రదర్శన

- నేడు రజకుల గాడిదల ప్రదర్శన



ఆలయం చుట్టూ ఎడ్ల బండిని తిప్పుతున్న రైతులు

కల్లూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని చౌడేశ్వరీదేవి ఆలయంలో ఉగాది సంబరాలు అత్యంత ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కార్య నిర్వహణ అధికారి గుర్రెడ్డి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు ఆలయంలో పంచాంగ శ్రవణం, దేవిఖడ్గమాలా స్తోత్రపూజ జరిపారు.

**ఉత్సాహభరితంగా రైతుల ఎడ్లబండ్ల ప్రదర్శన**

ఉగాది వేడుకల్లో భాగంగా ఎడ్లబండ్ల ప్రదర్శన ఉత్సాహభరితంగా అందరినీ అలరించింది. ముందుగా కల్లూరు ఊరివాకిలి రైతులు మొక్కులు తీర్చుకునేందుకు ఎద్దులను అలంకరించి ఊరేగించారు. ఊరువాకిలి నుండి మేళతాలతో ఊరేగిస్తూ అమ్మవారి ఆలయం చుట్టూ రైతులు ఎద్దులబండ్ల ప్రదక్షిణ చేశారు. ఆలయంలో నారుమడి పద్ధతిలో రైతుసంఘం, ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన బురదనీటిలో రైతులు, యువత కేరింతల నడుమ ఎడ్లబండ్ల ప్రదర్శన కన్నులపండువగా నిర్వహించారు. తమ మొక్కులను తీర్చుకునేందుకు తరలి వచ్చిన ఎండ్లబండ్ల ఊరేగింపు తిలకించేందుకు జిల్లా నలుమూలల నుండి ప్రజలు, భక్తులు ఆశేషంగా తరలివచ్చారు. ఇదే తరహాలో నేడు రజకులు పుష్కలంగా వర్షాలు కురవాలని భక్తిశ్రద్దలతో గాడిదలను ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయిస్తారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న గౌరు దంపతులు

**గౌరు దంపతుల పూజలు:** కల్లూరులోని చౌడేశ్వరీదేవి ఆలయాన్ని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి ఆదివారం సందర్శించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి, కమిటీ సభ్యులు ఎమ్మెల్యే గౌరు దంపతులకు పూర్ణకుంభంతో సాదర స్వాగతం పలికారు. చౌడేశ్వరీదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అట్లాగే మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని ఉమామహేశ్వరమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

## భార్యను హత్య చేసిన భర్త అరెస్టు

ఆత్మకూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): భార్యను హత్య చేసిన కేసులో భర్తను అరెస్టు చేసినట్లు ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వెలుగోడు పోలీసు స్టేషన్ పరిధిలోని తిమ్మనపల్లి గ్రామానికి చెందిన ఇస్కాల మధుకృష్ణ తన భార్య ఇస్కాల లక్ష్మీదేవి అలియాస్ పుల్లమ్మకు వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో ఈ నెల 28వ తేదిన గొడ్డలితో దాడి చేసి హత్య చేశాడు. మృతురాలి తల్లి వెంకటసుబ్బమ్మ ఫిర్యాదు మేరకు నిందితున్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు.

## వ్యక్తి ఆత్మహత్యాయత్నం

నంద్యాల క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని ఉప్పరిపేటలో రూ.10వడ్డీకి అప్పు తీసుకొని అప్పుదారుల వత్తిడి తట్టుకోలేక మహేష్ అనే వ్యక్తి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్న మహేష్ వడ్డీ వ్యాపారుల వత్తిడి తట్టుకోలేక ఆదివారం ఇంట్లో నిద్రమాత్రలు మింగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. కుటుంబసభ్యులు నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

## తెలుగు సంస్కృతికి ప్రతీక ఎద్దుల పోటీలు: మంత్రి



ఎద్దుల పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి ఫరూక్

గోస్పాడు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంస్కృతికి ఎద్దుల పోటీలు ప్రతీక అని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. ఉగాడి పర్వదినం, అంకాళమ్మ తిరుణాళ్ల సందర్భంగా సాంబవరం గ్రామంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఎద్దుల పోటీలను మంత్రి ఫరూక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వారి మొదటి పండుగ ఉగాది సందర్భంగా ఎద్దుల పోటీలు జరడం ఆనవాయితీ అన్నారు. ఈ పోటీల్లో నందికొట్కూర్ మండలం కొణిదేల గ్రామానికి చెందిన దండు శేఖర్ ఎద్దులు మొదటి స్థానంలో నిలిచి రూ 50 వేలు దక్కించుకున్నాయి. వరుసగా నాలుగు స్థానాల్లో నిలిచిన ఎద్దుల యజమానులకు నగదు బహుమతులు ఇచ్చారు.



## 16 మంది సీఐల బదిలీ

కర్నూలు క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కర్నూలు అనంతపురం రేంజ్ పరిధిలో 16 మంది సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

| సీఐ పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ స్థానం |
|---|---|---|
| యు. సదాశివయ్య | పిటీసీ, తిరుపతి | ప్రొద్దుటూరు టూటౌన్ పీఎస్, వైఎస్సార్ కడప |
| ఎం.యుగంధర్ | ప్రొద్దుటూరు టూటౌన్ పీఎస్, వైఎస్సార్ కడప | ఆళ్లగడ్డ యుపీఎస్, నంద్యాల |
| ఎస్.చిరంజీవి | ఆళ్లగడ్డ యూపీఎస్, నంద్యాల | ఫ్యాక్షన్ జోన్, కర్నూలు |
| వై.ఎల్లమరాజు | వీఆర్, అన్నమయ్య | మహిళా పోలీస్ స్టేషన్, వైఎస్సార్ కడప |
| ఎం.కృష్ణారెడ్డి | మహిళా పోలీస్ స్టేషన్, వైఎస్సార్ కడప | చెన్నూరు యూపీఎస్, వైఎస్సార్ కడప |
| ఆర్.పురుషోత్తం రాజు | చెన్నూరు యుపీఎస్, వైఎస్సార్ కడప | ఎస్బీ-1, వైఎస్సార్ కడప |
| టి.రెడ్డప్ప | ఎస్బీ-1, వైఎస్సార్ కడప | సీసీఎస్-2, వైఎస్సార్ కడప |
| ఎస్.చాంద్‌బాషా | సీసీఎస్-2 వైఎస్సార్ కడప | పులివెందుల యూపీఎస్, వైఎస్సార్ కడప |
| టి.నరసింహులు | పులివెందుల యూపీఎస్, వైఎస్సార్ కడప | వేంపల్లి యూపీఎస్, వైఎస్సార్ కడప |
| ఏ.సురేష్ రెడ్డి | వేంపల్లి యూపీఎస్, వైఎస్సార్ కడప | వీఆర్, వైఎస్సార్ కడప |
| పి.ఈశ్వర్ రెడ్డి | వీఆర్, వైఎస్సార్ కడప | డీసీఆర్బీ, వైఎస్సార్ కడప |
| యు.వెంకట కుమార్ | డీసీఆర్బీ, వైఎస్సార్ కడప | వీఆర్, వైఎస్సార్ కడప |
| హెచ్. కృష్ణమరాజు నాయక్ | వీఆర్, వైఎస్సార్ కడప | సీసీఎస్-1 వైఎస్సార్ కడప |
| సి.భాస్కర్ రెడ్డి | సీసీఎస్-1 వైఎస్సార్ కడప | వీఆర్, వైఎస్సార్ కడప |
| వి.శ్రీహరి | వీఆర్, కర్నూలు | మైదుకూరు యూపీఎస్, వైఎస్సార్ కడప |
| ఎం. గంగిరెడ్డి | వీఆర్, నంద్యాల | సీసీఎస్-2 నంద్యాల |

# సంస్కృతిని భావి తరాలకు అందించాలి

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్
- టీజీవీ కళాక్షేత్రంలో వైభవంగా ఉగాది సంబరాలు

కర్నూలు కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందజేయాలని, కులమతాలకు అతీతంగా పండుగలను అందరూ కలిసిమెలసి జరుపుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి శ్రీ విశ్వావసు నామ ఉగాది సంబరాలు కన్నుల పండువగా సాగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన టీజీ వెంకటేశ్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ పండుగల్లో ఉగాదికి ప్రత్యేక స్థానమని చెప్పారు. ఉగాది వేడుకలో స్వీకరించే షడ్రుచుల ఉగాది పచ్చడి జీవిత సారాన్ని తెలియజేస్తుందని అన్నారు. టీజీవీ కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఇనాయతుల్లా వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

**అలరించిన ఉగాది సంబరాలు...**

టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి జరిగిన ఉగాది సంబరాలు తొలుత కృష్ణ బృందం నాదస్వర కచ్చేరితో వైభవంగా ఆరంభమయ్యాయి. అనంతరం ఈ ఏడాది రాశిఫలాలను తెలియజేస్తూ ప్రముఖ శాస్త్ర పండితుడు భానుశర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఈ వేడుకల్లో భాగంగా కూచిపూడి నృత్య గురువు కరీముల్లా బృందం ప్రదర్శనలు అలరించాయి. అనంతరం జిల్లాలో వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వారికి ఉగాది పురస్కారాలు అందజేశారు. జి. పుల్లయ్య (విద్య), పి. దస్తగిరి (పద్య నాటకం), గీతాంజలి (సంగీతం), జంధ్యాల రఘుబాబు (సాహిత్యం), పి. మీనా (నృత్యం), ఎం. శ్రీనివాసరాజు (జర్నలిజం), మంజుల (హరికథ), దాసరి వెంకటరమణ (చిత్రలేఖనం), ఎం. వినీల (వాస్తు)లలో ఎంపిక చేసి జ్ఞాపిక, శాలువలతో ఘనంగా సత్కరించారు. అలాగే కవి సమ్మేళనంలో పాల్గొన్న ఇనాయతుల్లా, బీవీ స్వరూప్ సిన్హా, కల్యాణదుర్గం స్వర్ణలత, డాక్టర్ కె. చంద్రమౌళిని తదితరులను సత్కరించారు.



విద్యావేత్త పుల్లయ్యను సత్కరిస్తున్న టీజీ వెంకటేశ్

# ఘనంగా ఉగాది సంబరాలు

## ఆలయాల్లో పంచాంగ పఠనం

**కర్నూలు కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):** విశ్వావసు నామ ఉగాది సంబరాలను నగర ప్రజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. హరిహర క్షేత్రంలో ఆదివారం సాయంత్రం జరిగిన పూజాది కార్యక్రమాలకు మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ సతీమణి టీజీ రాజ్యలక్ష్మి, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ సతీ మణి టీజీ శిల్పాభరత్‌లు హాజరై పుజలు నిర్వహించారు. అనంతరం కల్లే వేణుగోపాల శర్మ ఆధ్వర్యంలో చేపట్టిన పంచాంగ శ్రవణం కార్యక్రమంలో వారు పాల్గొని, పంచాంగ శ్రవణాన్ని ఆలకించారు. వారికి ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సండేల్ చంద్రశేఖర్, చల్లా నాగరాజ శర్మ స్వామి, అమ్మవార్ల ప్రసాదాలు అందజేశారు. నెహ్రూనగర్‌లోని పుట్టపర్తి సత్యసాయి బాబా మందిరంలో ఉగాది సందర్భంగా సత్యసాయి పారాయణ, రుద్ర పారాయణ, భజనలు, పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆలయ పురోహితులు కేశవయ్య ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. అలాగే పాతనగరం లోని జమ్మిచెట్టు సమీపంలోగల లలితా పీఠంలో మహిళలు సామూహిక లలితా సహస్రనామ పారాయణం చేశారు. సాయంత్రం మామిళ్లపల్లి రాజేశ్ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్ర మంలో లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి, పీఠం సేవకులు పాల్గొన్నారు. కొత్తబస్టాండు వెనుక ఉన్న కల్లూరు చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయం వద్ద అమ్మవారి దర్శనం కోసం ప్రజలు బారులు తీరారు. సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. సాయంత్రం బ్రహ్మశ్రీ కల్లే వేణుగోపాల శర్మ పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సండేల్ చంద్రశేఖర్, చల్లా నాగరాజ శర్మ, కమిటీ గౌరవాధ్యక్షుడు సీవీ దుర్గాప్రసాద్, గౌరవ సలహాదారు టీవీ రవిచంద్ర శర్మలు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పాతబ స్టాండు సమీపంలోని సుబేదారి వీధిలోని నాగ సుంకులా పరమేశ్వరి ఆలయంలో పూజారి కురువ శ్రీరాములు అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్ర మంలో మోహన్, రవిప్రకాశ్, ఆర్యన్, యశస్విని, సాయిచరణ్, చైతన్య పాల్గొన్నారు. నగరంలో కిడ్స్ వరల్డ్ సమీపంలోని జిల్లా గో సంరక్షణ శాలలో ఆదివారం సాయంత్రం ఈశ్వర శశిధర కుమార్‌శర్మచే పంచాంగ శ్రవణం నిర్వహించారు. బుధవారపేటలోని సుంకులమ్మ, నెహ్రూరోడ్డు లోని మారెమ్మ, సప్తగిరినగర్‌లోని సుంకులమ్మ, చిత్తారివీధి లోని నిమిషాంబాదేవి ఆలయాల్లో అమ్మవార్లకు పూజలు నిర్వహిం చారు. ఆయా దేవాలయాల్లో సాయంత్రం జరిగిన పంచాంగ శ్రవణ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

● **టీటీడీ- హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో..** విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుక సందర్భంగా ఆదివారం సాయంత్రం పాతన గరంలోని పేట శ్రీరామాలయంలో టీటీడీ- హిందూధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉగాది పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి వితరణ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మాళిగి హనుమే షాచ్యులు ద్వాదశ రాశుల వారి సంవత్సర ఫలితాలు వివరించారు. వివిధ రాశి ఫలాలు, రాష్ట్ర, దేశ కాలమాన పరిస్థితులు, వ్యవసాయం, వర్షాలు తదితర అంశాలను ఆయన వీనులవిందుగా పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, ఆలయ శతాబ్ది ఉత్సవ సమితి సభ్యులు మాళిగి వ్యాసరాజు, సతీష్, సుధీంద్ర, చిల్కూరి ప్రభాకర్, విఠల్‌శెట్టి, నందకిషోర్ పాల్గొన్నారు.

**ఓర్వకల్లు:** మండలంలోని ఓర్వకల్లు, కన్నమడకల, పూడిచెర్ల, నన్నూరు, లొద్దిపల్లె, మీదివేముల, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, గుట్టపాడు, ఎన్.కొం తలపాడు, శకునాల, హుశేనాపురం, పాలకొలను, సోమయాజులపల్లె, తదితర గ్రామాల్లో ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో వెలసిన ఆలయాలకు వెళ్లి స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. ఓర్వకల్లులోని చెన్నకేశవస్వామి ఆలయంలో ఈవో చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ పురోహితులు విష్ణుశర్మ, అర్చకులు నారాయ ణశర్మ పంచాంగ పఠనం చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు ఎద్దులకు కాడి గట్టి తమ పొలాలను దుక్కిదున్నారు. ఓర్వకల్లు చెన్నకేశవస్వామి ఆలయంలో నిర్వహించిన పంచాంగ పఠనంలో నాయకులు గోవిందరెడ్డి, శంకర్ రెడ్డి, రంగనాథగౌడు, కురువ పెద్దయ్య, అల్లాబాబు, అబ్దుల్లా, నాగరాజు, రైతులు, భక్తులు పాల్గొన్నారు.

**కర్నూలు ఎడ్యుకేషన్:** విశ్వావసు నామ ఉగాది సంవత్సరం సందర్భంగా ఎ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాలలో ఆర్ఎస్ఎస్ నిర్వహించిన నగర సాంఘిక్‌లో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) కర్నూలు తరపున ఉగాది పచ్చడి వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు బి.చిన్ననాగ స్వామి నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బి.వెం కటేశ్వర్లు, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు జేవీఆర్ శెట్టి, ఓర్వకల్లు మండల అధ్యక్షుడు కె.రామకృష్ణుడు పాల్గొన్నారు.

● సలాంఖాన్ ఎస్టీయూ భవనంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి అధ్యక్షతన తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా పంచాంగ పఠనం నిర్వహించారు. గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు హీరాలాల్ పురోహితుడిగా వ్యవహరించి పంచాంగ పఠనం గావించారు. విశ్వావసు నామ సంవత్సరంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడి పంటలు బాగా పండుతాయని, పత్తికి మంచి ధర ఉంటుందని, రాశీ ఫలాలు చదివి వినిపించారు. కార్యక్రమంలో టీకే జనార్దన్, నాగయ్య, గుప్తా శ్రీధర్‌ఖ, సురేష్, హుశేన్‌మియా, ఏళ్ల నాగరాజు, ముర్తుజావలి, బాలకృష్ణ, గోవిందు, గోవిందు నాయక్, శాంతమూర్తి, దేవరాజు, నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**గూడూరు:** విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పర్వదినాన్ని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కె.నాగలాపురం సుంకులాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. అలాగే గూడూరు పట్టణంలోని స్వయంభూ ఆంజనేయస్వామి సుంకులమ్మ, కాళికామాత, నీలకంఠేశ్వరస్వామి ఆలయాల్లో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయస్వామి ఆలయం దగ్గర పురోహితుడు ఆమంచి విశ్వేశ్వర శర్మ పంచాంగ శ్రవణం వినిపించారు. ఆలయాలను విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు.


కె.నాగలాపురంలో సుంకులమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు పోటెత్తిన భక్తులు


ఓర్వకల్లులో సుంకులమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు


హరిహర క్షేత్రంలో పూజలకు హాజరైన భక్తులు


పంచాంగాన్ని ఆలకిస్తున్న టీజీ వెంకటేశ్ కుటుంబ సభ్యులు



లలితా పీఠం, సత్యసాయి మందిరంలో పంచాంగ పఠనం చేస్తున్న అర్చకులు



ఎస్టీయూ ఆధ్వర్యంలో పంచాంగం వినిపిస్తున్న హీరాలాల్


ఓర్వకల్లులో ఆలయాలకు ఎద్దులబండ్లతో కర్రసాములతో బయలుదేరుతున్న భక్తులు

## ఘనంగా వల్లెలాంబదేవి రథోత్సవం

**కోడుమూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి):** ఉగాది పండుగ పురస్కరించుకుని పట్టణంలోని హంద్రీనది ఒడ్డున వెలసిన వల్లెలాంబదేవి రథోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉదయం అమ్మవారి ఆలయంలో రథాంగ హోమం, అమ్మవారికి అభిషేకం, సాయంత్రం ఉత్సవ విగ్రహానికి పూజలు చేపట్టారు. పూజల ముగిసిన అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథం ఉంచి అశేష జనవాహిన మధ్య ఊరేగించారు. ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, రమేష్‌బాబు, రవికుమా రెడ్డి, శ్రీనివాసరెడ్డి, క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా ప్రభోత్సవం


ప్యాలకుర్తిలో ప్రభోత్సవంలో పాల్గొన్న భక్తులు

**కోడుమూరు రూరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి):** మండలంలోని గ్రామాల్లో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయానే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పులకుర్తి లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో కల్యాణం, సాయంత్రం ప్రభోత్సవం నిర్వహించారు. ప్యాలకుర్తి లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం, సాయంత్రం ప్రభపై ఉత్సవమూర్తులను ఊరేగించారు. గోరంట్ల, వర్కూరులో మేళ తాళాల మధ్య లక్ష్మీమాధవస్వామికి పల్లకోత్సవం జరిపించారు. వెంక టగిరి గిడ్డాంజనేయస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు.


గోరంట్లలో లక్ష్మీమాధవస్వామి పల్లకీసేవ

## నగరంలో పన్ను వసూలు వేగవంతం

### నేటితో ముగియనున్న ఆర్థిక సంవత్సరం


పన్ను వసూలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మేనేజర్ చిన్నరాముడు

**కర్నూలు న్యూసిటీ, మార్చి 30(ఆంధ్రజ్యోతి):** మార్చి 31తో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఆస్తి, ఖాళీ స్థలం పన్ను వసూళ్ల అధికారుల, సిబ్బందితో వేగవంతం చేసినట్లు కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నాలుగు మాసాల క్రితం నుంచే పక్కా ప్రణాళికతో పన్ను వసూళ్లను చేపట్టామన్నారు. ఇప్పటికి ఆస్తి, ఖాళీ స్థలం పన్నులు, తాగునీటి కొళాయి పన్నులు రూ.77 కోట్లు దాటిందన్నారు. రెవెన్యూ సిబ్బందే కాకుండా అమినిటీస్ కార్యదర్శులు, ఏఈలు, చివరల్లో డీఈఈల సేవలను సైతం వినియోగంచామన్నారు. శనివారం ఒక్కరోజు రూ.2.41 కోట్లు వసూలు చేశామన్నారు.

● 50 శాతం వినియోగానికి సోమవారమే చివరిరోజు అని కార్పొరేషన్ మేనేజర్ చిన్నరాముడు అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని పన్ను వసూలు కేంద్రంతోపాటు కల్లూరు వారు కార్యాలయం 85, బాలాజీ నగర్ 85 సచివాలయాల్లోని ప్రత్యేక కౌంటర్లును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నరాముడు మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగుస్తుందని, బకాయిదారులు తమ ఆస్తి, ఖాళీ స్థలం, తాగునీటి కొళాయి పన్నులు, ట్రేడ్ లైసెన్సు రుసుములను వెంటను చెల్లించాలన్నారు. చివరిరోజు ఉదయం 9గంటల నుంచి రాత్రి వరకు పన్ను వసూళ్ల కేంద్రాలు, ప్రత్యేక కౌంటర్లు తెరిచే ఉంటాయన్నారు.

## రంజాన్ తోఫా పంపిణీ


ముస్లింలకు రంజాన్ తోఫా అందజేస్తున్న మంత్రి టీజీ భరత్

**కర్నూలు అర్బన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి):** పేదలకు మంచి చేయాలన్న తపన అందరిలో రావాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని రోజా ప్రాంతంలో షేర్ షాసూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రంజాన్ సందర్భంగా ఉచితంగా రంజాన్ తోఫా కిట్లను పంపిణి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ షేర్ షా సూరి చారిటబుల్ ట్రస్ట్ తరపున 500 మందికి రంజాన్ తోఫా పంపిణి చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. ట్రస్ట్ తరపున ఎన్నో సేవా కార్యక్రమాలలు చేస్తున్న చైర్మన్ సూరి మన్సూర్ అలీఖాన్‌ను అభినందించారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలన్నారు.

## నల్ల రిబ్బన్లతో నమాజ్‌కు రావాలి: మాజీ ఎమ్మెల్యే

**కర్నూలు న్యూసిటీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):** రంజాన్ సందర్భంగా జగన్నాథగట్టుపై ఆదివారం ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో మాజీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, వైసీపీ నాయకులు పాల్గొని దువా చేశారు. ఈసందర్భంగా హఫీజ్ ఖాన్ మాట్లాడుతూ వక్ఫ్ అమెండ్మెంట్ బిల్లు ప్రవేశ పెట్టిన సందర్భంగా ముస్లిం పర్సనల్ లా బోర్డు వారి పిలుపు మేరకు సోమవారం జరగబోయే ఈద్-ఉల్-ఫితర్ పండుగ నమాజ్‌కు హఫీజ్ ఖాన్ నల్లరిబ్బన్లతో వచ్చి నిరసన తెలపాలన్నారు.

## రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

**కర్నూలు క్రైం మార్చి 30(ఆంధ్రజ్యోతి):** జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలలో సంబంధిత సీఐలు, ఎస్ఐలు రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠినచర్యలు తీసుకుంటామన్నారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని అన్నారు.

## ముస్లింల అభివృద్ధికి కృషి: ఎంపీ


ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

**కర్నూలు అర్బన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి):** ముస్లింల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. ఆదివారం పంచలింగాల, నగరంలోని పాత ఈద్గాలో ముస్లింలకు ఇఫ్తార్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ ప్రార్థనలు చేసి, రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సామాజిక సేవలు అభినందనీయం


పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న కమిషనర్

**కర్నూలు న్యూసిటీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):** కార్పొరేషన్ ఉద్యోగులు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందించదగ్గ విషయమని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. ఆదివారం రామలింగేశ్వర నగర్ 17వ శానిటేషన్ డివిజన్ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో 42 మంది పారిశుధ్య కార్మికులకు దుస్తుల బహూకరణ, చలివేంద్రం ప్రారంభోత్సవం, ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాలకు కమిషనర్ ముఖ్యఅ తిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు.

## గ్రామీణ రహదారులకు మహర్దశ


రోడ్డు పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకుడు వినోద్‌కుమార్

**కల్లూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వంలో గ్రామీణ రహదారులకు మహర్దశ వచ్చిందని టీడీపీ నాయకుడు వినోద్‌కు మార్ అన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ఆదేశాలతో కొంగనపాడు గ్రామానికి రూ.3.6 కోట్లతో 6.9కిలోమీటర్ల రహదారి నిర్మాణం పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఆదివారం కొంగన పాడులో రోడ్డు నిర్మాణ పనులను పిఆర్‌ఐ జేఈ హనుమంతరెడ్డితో కలిసి వినోద్‌కుమార్ పరిశీలించారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉం చుకుని ఎమ్మెల్యే చొరవ తీసుకుని కొంగనపాడుకు పక్కా రహదారి నిర్మాణం పనులు చేయించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని వినోద్ కుమార్ తెలిపారు.

## విద్యార్థుల దాహం తీర్చిన ఎమ్మెల్యే


బోరు మోటారును ప్రారంభిస్తున్న దిన్నెదేవరపాడు సర్పంచ్

**కర్నూలు కల్చరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి):** నగర శివారులోని జి.పుల్లారెడ్డి నగర్‌లోగల విజ్ఞాన పీఠం అరక్షిత బాలుర పాఠశాల్లో విద్యార్థుల దాహం తీర్చేందుకు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ముందుకు వచ్చారు. విజ్ఞాన పీఠం పూర్వ విద్యార్థి అయిన ఎమ్మెల్యే ఇటీవల అక్కడ విద్యార్థులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను గుర్తించారు. పాఠశాల ఆవరణలో బోరు వేయించారు. నీరు సమృద్ధిగా రావడంతో, దిన్నెదేవరపాడు సర్పంచ్ మాధవ్‌స్వామి ద్వారా రూ.60 వేలు ఖర్చుతో బోరు మోటారు ఏర్పాటు చేయించారు. ఆదివారం ఉగాది సందర్భంగా సర్పంచ్ మాధవ్‌స్వామి తన స్వహస్తాలతో బటన్ నొక్కి బోరు మోటారును ప్రారంభించారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రామిరెడ్డి చొరవతో విద్యార్థులకు నీటికష్టం తొలగిపోయిందని కరస్పాండెంట్ పీపీ గురుమూర్తి తెలిపారు. ఎమ్మెల్యే బొగ్గల దస్తగిరికి, సర్పంచ్ మాధవస్వామికి పాఠశాల ఉపాధ్యా యులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట

**కర్నూలు అర్బన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి):** పేద ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. ఆదివారం నగరంలోని తన కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.8,40,332 చెక్కు లను ఆయన బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదన్నారు. కేవలం అర్హత ఆధారంగా ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందిస్తుందన్నారు.

## రంజాన్ సందడి


డ్రైఫ్రూట్స్ కొనుగోలు చేస్తున్న మహిళలు


పూలు కొనుగోలు చేస్తున్న ముస్లింలు

**కర్నూలు కల్చరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి):** రంజాన్ సోమవారం జరుపుకోనున్న నేపథ్యంలో కర్నూలు నగరంలో ఆదివారం సందడి నెలకొంది. ముస్లింలు పూలు, డ్రైఫ్రూట్స్, సేమ్యా కొనుగోలు చేశారు. అలాగే కిరాణం, వస్త్ర దుకాణాల వద్ద ముస్లింల సందడి కనిపించింది.

## వడ్డీ మాఫీ నేటితో ఆఖరు

**ఆదోని టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని ఆస్తి పన్నుల బకాయిలపై ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ మాఫీ అవకాశం నేటితో ముగియనుందని మున్సిపల్ కమిషనర్ కృష్ణ ఆదివారం తెలిపారు. బకాయిలపై వడ్డీలో ప్రభుత్వం 50 శాతం తగ్గిస్తూ 31వ తేదీలోగా చెల్లించడానికి అవకాశం వచ్చిందని తెలిపారు. బకాయిలు ఉన్నవారు చెల్లించేందుకు సోమవారం సెలవు రోజు కూడా కౌంటర్లు పనిచేస్తాయని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కమిషనర్ కోరారు.

## రాతిదూలం పోటీలు సంస్కృతికి అద్దం


రాతిదూలాన్ని లాగుతున్న ఎద్దులు

**మద్దికెర, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):** రాతిదూలం పోటీలు పల్లెల సంస్కృతికి అద్దంపడతాయని గ్రామ పెద్దలు తెలిపారు. ఆదివారం మండలంలోని పెరవలి గ్రామంలో ఉగాది పురస్కరించుకుని రాతిదూలం పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వృషభాలను మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు.

## వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి : సీఐ

**తుగ్గలి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):** వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ సూచించారు. ఆదివారం చెరువుతండా వద్ద వాహనాలు తనిఖీలు చేసి జీరో యాక్సిడెంట్లపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ రూల్స్‌ను పాటిస్తే ప్రమాదాలకు గురి కాకుండా క్షేమంగా గమ్యాలకు చేరుతారన్నారు. అతివేగం, పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకోవడం, హెల్మెట్ లేకుండా బైక్ నడపడం చేయకూడదన్నారు. వాహనానికి సంబంధించిన రికార్డులు కలిగి ఉండాలన్నారు. మద్యం అక్రమ రవాణ చేయకూడదన్నారు.

## రూ.50 వేల ఆర్థిక సాయం


కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం చేస్తున్న స్నేహితులు

**వెల్దుర్తి, మార్చి 30(ఆంధ్రజ్యోతి):** స్నేహితుడి కుటుంబానికి చెరుకులపాడు జడ్పీ ఉన్నత పాఠశాల 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు తమ స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. పూర్వ విద్యార్థి రామాంజనేయులు ఇటీవల మృతిచెందాడు. ఆదివారం స్నేహితులు తాము సేకరించిన రూ.50 వేలను కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. శివ మాధవులు, రామాంజ నేయులు, పెద్దమాదన్న, మారెన్న, రామలింగం, ఎల్లనాగన్న, రాముడు తదితరులు పాల్గొన్నారు.

## దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ హుసేన్ సాహెబ్

**మద్దికెర, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):** మండల ప్రజలు దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ తెలిపారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ ప్రారంభించారు. కార్యాలయానికి వచ్చే ప్రజల కోసమే ఏర్పాటుచేశామన్నారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో అత్యవసరమైతేనే తప్ప బయటకు రావద్దని సూచించారు. సీనియర్ అసిస్టెంట్ రవి, సిబ్బంది మోదీన్, మస్తాన్, తదితరులు ఉన్నారు.

## రెవెన్యూ అధికారులపై దాడులు హేయం


మాట్లాడుతున్న రెవెన్యూ అసోసియేషన్ నాయకులు

**ఆదోని, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):** రెవెన్యూ అధికారులపై భౌతిక దాడులకు పాల్పడడం హేయమైన చర్య అని రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆదోని డివిజన్ అధ్యక్షుడు రజనీకాంత్ రెడ్డి, కార్యదర్శ వలిభాషా, కోశాధికారి రామేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం అసోసియేషన్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం రెవెన్యూ ఉద్యోగులు తీవ్రమైన పని ఒత్తిడి ఎదుర్కొంటున్నారని తెలిపారు. సహకరించాల్సిన అధికార, ప్రతిపక్ష నాయకులు ఉద్యోగులను దూషిస్తూ, భౌతిక దాడులకు పాల్పడడం పద్ధతి కాదన్నారు. ఇటీవల సి.బెళగల్ వీఆర్‌వో వెంకటేశ్వరులుపై టీడీపీకి కార్యకర్త భౌతికంగా దాడి చేయగా, దాన్ని మరవకముందే పెద్దకడబూరు తహసీల్దార్‌పై సీపీఐ నాయకుడు బి.వీరేష్ అసభ్యకరంగా మాట్లాడి, కార్యాలయంపై దాడికి యత్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. రాఘవేంద్ర, జర్మియా, రుద్రగౌడ్, మహేష్, పెద్దయ్య, కౌసర్ భాను, లక్ష్మీ, ఈరన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## బేతపల్లి వాసికి పురస్కారం

**దేవనకొండ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని బేతపల్లి గ్రామ రైతు ఖానాపురం సుంకన్నకు ఉగాది పురస్కారం లభించింది. ఆదివారం కర్నూలులో పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్, కలెక్టర్ రంజీత్‌బాషా అందజేశారు. తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ పంటలు సాగు చేసి, అధిక దిగుబడులు సాధించినందుకు తనకు అందజేశారని, ముడేకరాళ్లలో అంజీర, బొప్పాయి, నేరెడు, వాటర్‌ఆపిల్ సాగు చేసినట్లు రైతు తెలిపారు.

# ఉగాది వైభవం

- ఆదోని, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో వేడుకలు
- పంచాంగాన్ని వినిపించిన పండితులు


ఆలూరు మండలం ముసనహళ్ళి గ్రామంలో సోమేశ్వర స్వామి రథోత్సవం


ఆస్పరి: వీరభద్ర స్వామి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

**ఆదోని టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):** ఉగాది సందర్భంగా ఆదోనిలో గ్రామదేవతలు మారెమ్మ, సుంకులమ్మ ఆలయాల్లో పూజలు చేశారు. చిన్న మార్కెట్ సుంకులమ్మ, మారెమ్మ ఆలయాలకు ఉదయం ఆరు గంటల నుంచి భక్తులు బారలు తీరారు. జనం బారులు తీరి గ్రామదేవతలను దర్శించుకుని తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. తెలుగు సంవత్సరాది సందర్భంగా గ్రామదేవతలను దర్శించుకుని, చీర సారేలతో పాటు, నైవేద్యం సమర్పించుకొని ప్రత్యేక పూజలతో మొక్కుబడులు తీర్చుకోవడం ఆనవాయితీ.

**ఆదోని అగ్రికల్చర్:** పట్టణంలోని చిన్న మార్కెట్ మారెమ్మ, సుంకలమ్మ ఆలయం, కొత్త బస్టాండ్ రోడ్డులోని ఆలయంలో భక్తులు పూజలు చేశారు.

**పూజారికి ఉగాది పురస్కారం**

**మద్దికెర:** మండలంలోని రంగనాథ స్వామి ఆలయ పూజారి రంగనాధాచారికి ఉగాది పురస్కారం లభించింది. ఈమేరకు ఆదివారం కర్నూ లులో మంత్రి టీజీ భరత్, కలెక్టర్ రంజిత్‌బాషా సన్మానం చేశారు. మండలంలోని మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం తదితర గ్రామాల్లో ఉగాది పండుగను వైభవంగా జరుపుకున్నారు. మద్దమ్మ ఆలయం, పెరవలి రంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మద్దికెరలో కవిరెడ్డి వీధి యువకులు ఉగాది సందర్భంగా ఆనవాయితీగా వస్తున్న రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. వ్యక్తిగత కక్షలు ఉండకూడదని, ఎన్నో ఏళ్లుగా ఈ సంప్రదాయం కొనసాగిస్తూ వస్తున్నామని తెలిపారు.

**ఉగాది ఉత్సవాలు... పంచాంగ పఠనం**

**తుగ్గలి:** తెలుగు సంవత్సరాదిని గ్రామాల్లో జరుపుకున్నారు. ఆదివారం విశ్వవసునామ సంవత్సరం సందర్భంగా ఉగాది పచ్చడి, పిండి వంటలు చేసుకుని ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. రైతులు పొలాలకు వెళ్లి ఈ ఏడాది పంటలు బాగా పండాలని, సేద్యం పనులు ప్రారంభించారు. వేద పండితులు పంచాంగ పఠనం చేశారు.

**దేవనకొండ:** మండలంలో ఉగాది పండుగ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాలకు నైవేద్యం సమర్పించేం దుకు భక్తులు పోటెత్తారు. గద్దెరాళ్ల మారెమ్మ ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం పంచాగ పఠనం చేశారు. చెన్నకేశవస్వామి, భూదేవి, శ్రీదేవిని ఊరేగించారు.

**ఆదోని రూరల్:** మండలంలోని నాగలాపురం, పెసలబండ ఆంజనేయస్వామి ఆలయం, పెద్దహరివాణం అయ్యమ్మ ఆలయాల్లో వేడుకలు నిర్వహించారు. మామిడి ఆకులు, విద్యుత్ దీపాలతో అంగరంగ వైభవంగా అలంకరించారు. ఉత్సవమూర్తిని పూలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఉదయం నుంచి మహిళలు నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

**కొనసాగుతున్న వీరభద్రస్వామి ఉత్సవాలు**

**ఆస్పరి:** మండలంలోని కైరుప్పల గ్రామం కాళికాదేవి వీరభద్ర స్వామి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. ఉదయం పూజలు నిర్వహించి, పల్లకిలో ఉంచి పుష్పలదొడ్డి, యాటకల్లు, కల్లపరి, వెంగళ్ళయ దొడ్డి గ్రామ పొలమేరలలో ఊరేగిస్తూ కైరుప్పల వీరభద్ర స్వామి ఆలయంలోకి తెచ్చారు. గ్రామాల ప్రజలు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.


పత్తికొండ టౌన్: పంచాంగాన్ని పఠిస్తున్న పురోహితులు

**ఘనంగా ఉగాది వేడుకలు**

**పత్తికొండ టౌన్:** విశ్వవసు నామ సంవత్సరం సందర్భంగా పట్టణంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుమ్మరి వీదిలో ఉప్పర కట్ట వద్ద పెద్దమ్మవ్వ దేవాలయం, తేరుబజారులో చెన్నకేశవస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. చెన్నకేశవస్వామి ఆలయంలో సాయంత్రం 5 గంటలకు పురోహితులు పవన్‌కుమార్ పంచాంగ పఠనం నిర్వహించారు. రైతులు, ఆ ప్రాంత ప్రజలు పంచాంగాన్ని విన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉగాది వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు.


ఆదోనిలో ఆలయాల వద్ద దర్శనం కోసం వచ్చిన భక్తులు

**వైభవంగా సోమేశ్వర స్వామి రథోత్సవం**

**ఆలూరు రూరల్:** మండలంలోని ముసనహళ్ళి గ్రామంలో సోమేశ్వర స్వామి మనేకుర్తిలో రామలింగేశ్వర స్వామి, కురకుందలో శనేశ్వర స్వామి రథోత్సవం నిర్వహించారు. సీఐ రవి శంకర్ రెడ్డి బందోబస్తు నిర్వహించారు. సర్పంచులు పార్వతి సోమలింగ, కురవ కొల్లమ్మ, మాజీ సర్పంచ్ సోమ శేఖర్‌పాటిల్ శేషాద్రి రెడ్డి, కురవ దేవేంద్ర, కలబాయి అయ్యళ్ళి, కలబాయి దేవేంద్ర పాల్గొన్నారు.

**పంటలు సమృద్ధిగా పండుతాయి..**

**వెల్దుర్తి టౌన్:** విశ్వవసునామ సంవత్సరంలో పంటలు సమృద్ధిగా పండుతాయనీ పంచాంగ శ్రవణకర్త అన్నదానం కృష్ణశాస్త్రి అన్నారు. తెలుగు సంవత్సరాది ఉగాది పురస్కరించుకుని స్థానిక ఆలయంలో పంచాంగ పఠనం చేశారు. బొమ్మన దశరథరామిరెడ్డి, బొమ్మన రాజశేఖర్ రెడ్డి, చిన్నభాస్కర్ గౌడ్, రైతులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

## పుచ్చకాయతో ఉపశమనం

- వేసవిలో మంచిదంటున్న వైద్యులు


ఆలూరులో పుచ్చకాయలను విక్రయిస్తున్న వ్యాపారి

**ఆలూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):** అప్పుడే ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు దాదాపు 40 డిగ్రీలు నమోదవు తుండటంతో ప్రజలు అల్లాడుతున్నారు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు పుచ్చకాలయను ఆశ్రయిస్తు న్నారు. ఆలూరు పట్టణంలో వ్యాపారులు పుచ్చకాయలను విక్రయిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో కొనగోలు చేసి, ఆలూరుకు తెచ్చి, కాయ పరిమాణాన్ని బట్టి రూ.30ల నుంచి విక్రయిస్తున్నారు.

**పుచ్చకాయలతో ప్రయోజనాలు**

పుచ్చకాయలను మధుమేహ బాధితులు కూడా తినవచ్చని వైద్యులు సచిస్తున్నారు. నీరు అధికంగా ఉండటంతో తొందరగా అరుగుతుందని, విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉంటాయం టున్నారు. శరీరాన్ని హైడ్రేట్ చేయడంలో సహాయప డుతుంది, గుండే జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. దీనిలో ఉండే పొటాషియం, రక్తపోటును నియం త్రించడంలో సహాయ పడుతుంది. ఇందులో ఉండే లైకోపీన్, యాం టీ ఆక్సిడెంట్, క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోదిస్తుంది. ఫైబర్ అధికంగా ఉండటంతో జీర్ణక్రియను మెరుగు పరిచి, బరువు తగ్గిస్తుంది. విటమిన్-ఏ, సి లు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మం మరియు జుట్టు ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

**వేసవిలో మేలు**

పుచ్చకాయలతో వేసవిలో ఆరోగ్యానికి మేలు. ఇందులో ఎలక్ట్రోలైట్లు, కండరాల నొప్పులను తగ్గి స్తుంది. శరీరానికి తగి నంత శక్తిని ఇస్తుంది. వీటిలో ఉండే సహజ మైన చక్కెర, శరీరానికి శక్తిని అందిస్తుంది.. రోగనిరోధక శక్తిని పెంచుతుంది, విటమిన్ ఏ,సి ఉండటంతో కంటి చూపు మెరుగుపరుస్తుంది. **-డా.వహీద్, ప్రభుత్వ వైద్యుడు, ఆలూరు.**

## యూట్యూబర్‌పై కేసు నమోదు

**ఆదోని, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని యూట్యూబర్ పై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ శ్రీరామ్ తెలిపారు. వివరాల మేరకు.. 2025 మార్చి 26వ తేదీన రాయనగర్ కొట్టాల సమీపంలో అధికారులు ఆక్రమణలు తొలగిస్తుండగా, మహిళలు ఎమ్మెల్యేపై మండిపడ్డారు. దీన్ని యూట్యూబర్ బాధిత మహిళలు ఎమ్మెల్యే పార్థసారథిని అసభ్య పదజాలాలతో దూషించడాన్ని సోషల్ మీడియాలో వీడియో అప్‌లోడ్ చేశాడు. అది వైరల్‌గా మారడంతో తమ పార్టీ ఎమ్మెల్యే గౌరవాన్ని కించపరిచారని బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు భాగ్యలక్ష్మి ఫిర్యాదు చేశారు. యూట్యూబర్‌తో పాటు మహిళ పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## మార్కెట్ యార్డు కార్యదర్శిగా కల్పన

**ఆదోని అగ్రికల్చర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):** వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శిగా కల్పనను నియమిస్తూ మార్కెటింగ్ కమిషనర్ విజయ సునీత ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల మార్కెట్ కమిటీ కార్యదర్శిగా పని చేస్తున్న ఈమెకు, ఆదోని మార్కెట్ కమిటీకి పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పజెప్పారు. ఇక్కడ పనిచేస్తున్న సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి నేడు పదవీ విరమణ చేయనున్నారు. రేపు మంగళవారం ఆమె బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ పోస్టుకు ఆరు మందికి పైగా ప్రయత్నాలు చేయగా, చివరకు కల్పను నియమించారు.

## చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే

**మద్దికెర, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):** విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమేనని టీడీపీ నాయకులు దర్శి ప్రదీప్, కొత్తూరు శ్రీనివాసులు, అన్నారు. ఆదివారం బురుజుల గ్రామంలో కబడ్డీ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. రంగస్వామి, వీరేష్ కిషోర్, లోకేశ్, మధు, రంగనాథ్, కిరణ్ కుమార్, జశ్వంత్, సురేష్‌బాబు, ఓబులేసు పాల్గొన్నారు.

## కళ్యాణమ్మకు పురస్కారం

**పత్తికొండ, మార్చి 30(ఆంధ్రజ్యోతి):** మండలంలోని జెఎం తండా పాఠశాల ఉపాధ్యాయురాలు కళ్యాణమ్మకు ప్రభుత్వం ఉగాది పురస్కారం అందించింది. ఆదివారం కర్నూలులో జరిగిన ఉగాది వేడుకల కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్, కలెక్టర్ రంజిత్‌బాషా కళ్యాణమ్మకు ఉగాది పురస్కారాన్ని అందజేశారు.

## ఔరా.. సుబ్బు!

- 130 కిలోల రాతి గుండును ఎత్తిన యువకుడు

**హొళగుంద, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని గజ్జెహళ్లి పోతులింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో ఉగాది సందర్భంగా 130 కిలోల రాతి గుండును ఎత్తి సుబ్బు అనే వ్యక్తి అబ్బురపరిచాడు. గజ్జెహళ్లి గ్రామానికి చెందిన వడ్డే శేఖర్ 80 కిలోల గుండు ఎత్తి ద్వితీయస్థానంలో నిలిచాడు.


గజ్జెహళ్లిలో 130 కిలోల రాతి గుండును ఎత్తిన దాసరి సుబ్బు

## నేడు రంజాన్..

- ఆదోనిలో ముస్తాబైన మసీదు


విద్యుత్ దీపాలంకరణతో ఆదోని జామియా మసీదు

**ఆదోని అగ్రికల్చర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):** ముస్లింలు సోమవారం ఈద్ ఉల్ ఫీతర్ (రంజాన్) చేసుకోనున్నారు. 30 రోజులపాటు ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు నేడు విరమించనున్నారు. పట్టణంలోని మసీదులనను విద్యుత్ దీపాలతో అలంకరించారు. చారిత్రాత్మకమైన జామియా మసీద్ (పెద్ద మసీద్) చుట్టూ తినుబండారాలు సందర్శకులతో కళకళలాడుతోంది.

## పాడి రైతుకు పురస్కారం

**పత్తికొండ టౌన్, మార్చి 30 (ఆంధ్ర జ్యోతి):** పట్టణానికి చెందిన పాడి రైతు తులసిధర్ రెడ్డి కర్నూలులో ఆదివారం మంత్రి టీజీ భరత్, కలెక్టర్ రంజిత్ బాషా చేతుల మీదుగా ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. ఆయన డిగ్రీ వరకు చదువుకున్నప్పటికీ ఉద్యోగ అవకాశాలు రాకపోవడంతో స్వయం ఉపాధి వైపు మొగ్గు చూపారు. ఆవులు, గేదెలు పెంచుతూ రోజుకు వంద లీటర్ల పాల ఉత్పత్తిని చేస్తూ వచ్చారు. స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదుగుతున్న తులసిధర్ రెడ్డిని గుర్తించి అధికారులు ఉగాది పురస్కారానికి ఎంపిక చేశారు. తులసిరెడ్డి మాట్లాడుతూ ఉగాది సందర్భంగా ప్రభుత్వం చేత అవార్డురావడం ఎంతో సంతోషాన్నిచ్చిందని ఆయన తెలిపారు.

## వడదెబ్బపై జాగ్రత్త వహించాలి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- మద్దికెర ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి

**మద్దికెర, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):** వేసవిలో వడదెబ్బకు గురికాంకుడా పిల్లలు, మహిళలు వృద్ధులు జాగ్రత్త వహించాలని మద్దికెర ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి సూచించారు.



**ప్రశ్న:** వేసవిలో వచ్చే సీజనల్ వ్యాధుల గురించి వివరిస్తారా?

**జవాబు:** ఎండల తీవ్రతతో డీ హైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. వాంతులు, విరేచనాలు వచ్చే అవకాశముంది. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు తీసుకోవడం వల్ల వీటి నుంచి బయటపడొచ్చు.

**ప్రశ్న:** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా?

**జవాబు:** గ్రామాల్లో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పిస్తున్నారు.

**ప్రశ్న:** ఆసుపత్రిలో సిబ్బంది, మందుల కొరత ఉందా?

**జవాబు:** రోజు వైద్యశాలకు 150-200 మంది దాకా రోగులువస్తున్నారు. ఆసుపత్రిలో ఇద్దరు వైద్యులు, సిబ్బంది కూడా ఉన్నారు. మందులు అందుబాటులో ఉన్నాయి, కొరత లేదు.

**ప్రశ్న:** కుక్క కాటు మందులు ఉన్నాయా?

**జవాబు:** కుక్క కాటు బాధితులకు ఏఆర్‌వీ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. కుక్కకాటుకు గురైన వారు వైద్యశాలకు వచ్చి చికిత్స చేయించుకోవాలి.

**ప్రశ్న:** వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు?

**జవాబు:** బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, టోపీ, లేదా రుమాలు తలపై పెట్టుకోవాలి. తరుచూ కొబ్బరినీరు, రోజూ 4 లీటర్ల మంచీనీరు తాగాలి. ఎక్కువగా నీడ ప్రదేశాల్లో ఉండాలి. ఓఆర్ఎస్, మజ్జిగ అధికంగా తీసుకోవాలి. వడదెబ్బ సోకిన వ్యక్తిని నీడ ప్రదేశంలో ఉంచి, తడిగుడ్డతో శరీరాన్ని తుడవాలి. అనంతరం దగ్గరలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లాలి.

**ప్రశ్న:** గ్రామాల్లో వైద్య సేవల వివరాలు?

**జవాబు:** 104 వాహనం ద్వారా నెలకు రెండుసార్లు ఎఫ్‌టీటీ, ఎఫ్‌డీటీ ఫిక్స్‌డ్ సర్వీసు ద్వారా రోగులకు, గర్భిణులకు సేవలు అందిస్తున్నాము. వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాము.

**ప్రశ్న:** గర్భిణులకు ఎలాంటి వైద్య సేవలు అందిస్తున్నారు?

**జవాబు:** పీహెచ్‌సీలో 24గంటలు వైద్యసేవలు ఉంటాయి. ప్రతి బుధవారం గర్భిణులకు వైద్యపరీక్షలతో పాటు, రక్తపరీక్షలు, స్కానింగ్ కూడా చేస్తాము.

## పీఠాధిపతికి అభిషేకం



పీఠాధిపతికి హారతులు ఇస్తున్న మహిళలు

**మంత్రాలయం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):** మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులకు అభ్యాంజన తైలాభిషేకం, ముత్తయిదుల మహిళలు మహా మంగళహారతరలు ఇచ్చారు. ఆదివారం ఊంజల మండపంలో పండితులు, సంస్కృత విద్యార్థులు పీఠాధిపతికి అభ్యాంజన తైలాభిషేకం నిర్వహించారు. అనంతరం ముత్తయిదుల మహిళలు మహా మంగళహారతరలు ఇచ్చారు. అనంతరం గోపూజ, తులసి పూజ, మూలరాములకు పూజ, హారతులు, మంచాలమ్మకు పూజలు చేశారు. అనంతరం భక్తులనుద్దేశించి పీఠాధిపతి మాట్లాడారు. రాఘవేంద్రస్వామి మఠంలో ఆదివారం సాయంత్రం పంచాంగ శ్రవణం నిర్వహించారు. సంస్కృత పాఠశాల పండితులతో రచించిన శ్రీవిశ్వావసు నామ సంవత్సరం పురస్కరించుకుని ముద్రించిన తెలుగు, ఇంగ్లీషు, తమిళం, కన్నడ, హిందీ బాషల్లో ముద్రించిన పంచాంగ శ్రవణం చేసి భక్తులకు పుస్తకాలను అందజేశారు. ప్రతి ఏటా భక్తుల కోసం రూ.లక్ష వెచ్చించి అన్ని భాషలలో భక్తులకు అర్థమయ్యే విధంగా శ్రీమఠం నుంచి ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా, సకాలంలో కురిసి, రైతులు పాడి పంటలు పండి సస్యశ్యామలంగా ఉంటాయని పండితులు కొనియాడారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మఠం మేనేజర్లు శ్రీపతాచార్, సురేష్ కోనాపూర్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహ మూర్తి, సుజీంద్రాచార్, డీఎం ఆనందరావు, జేపీ స్వామి, రవికులకర్ణి, విజేంద్రాచార్, ద్వార పాలక అనంత స్వామి, ప్రకాషాచార్ పాల్గొన్నారు.

## టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి



రాఘవేంద్రరెడ్డికి మెమెంటో ఇస్తున్న జనసేన ఇన్‌చార్జి లక్ష్మన్న

**మంత్రాలయం, మార్చి 30(ఆంధ్రజ్యోతి):** టీడీపీతోనే రాష్ట్రం సాగు, తాగు పరిశ్రమలు, సంక్షేమం అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, జనసేన మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి బి.లక్ష్మన్న అన్నారు. ఆదివారం మండలంలోని మాధవరంలో రాఘవేంద్రరెడ్డి నివాసంలో విశ్వావసు నామ సంవత్సరం ఉగాది సందర్భంగా నాలుగు మండలాల జనసేన మండల అధ్యక్షులు ఆధ్వర్యంలో రాఘవేంద్రరెడ్డి, లక్ష్మన్నలను రాఘవేంద్రస్వామి బృందావన మెమెంటోలు ఇచ్చి సత్కరించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిల ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. గత ఐదేళ్లలో జరిగిన వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని, దీన్ని సరి చేసేందుకు కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందన్నారు. అనంతరం ఒకరికొకరు శాలువలు, పూలమాలలు మెమెంటోలు ఇచ్చుకుని సత్కరించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, జనసేన కోసిగి, పెద్దకడుబూరు, కౌతాళం, మంత్రాలయం మండల అధ్యక్షులు వీరారెడ్డి, బజారప్ప, సుమిత్ర, తిక్కయ్య, బీవీ రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## బీటీ నాయుడును కలిసిన టీడీపీ నాయకులు



ఎమ్మెల్సీ బీటీ నాయుడుతో టీడీపీ నాయకులు

**కోసిగి, మార్చి 30(ఆంధ్రజ్యోతి):** రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికైన బీటీ నాయుడును కోసిగి నాయకులు ఆదివారం కలిశారు. మాజీ మేజర్ గ్రామ సర్పంచ్ టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్ నాయుడు, ఆంజనేయస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నాడిగేని అయ్యన్న, టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్, టీడీపీ లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు, న్యాయవాది బీ.వీరేష్‌లు పూల మాలలు వేసి శాలువలతో సన్మానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు , విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లు బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి బీటీ నాయుడుకు రెండోసారి ఎమ్మెల్సీ అవకాశం కల్పించడం సంతోషించదగ్గ విషయమన్నారు. అలాగే వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ అమలు చేసే విధంగా టీడీపీ కృషి చేయాలని ముత్తురెడ్డి కోరారు.

## మంచాలమ్మకు విశేష పంచామృతాభిషేకం

**మంత్రాలయం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి).** మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ దేవతకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆదివారం ఉగాది శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మలవిసర్జనం, క్షీరాభిషేకం, కుంకుమ సేవ, విశేష పంచామృతాభిషేకం చేసి పట్టుచీర, బంగారు,వెండి ఆభరణాలుతో పాటు వివిధ రకాల పుష్పాలు, ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పీఠాధిపతి మహామంగళహారతులు ఇచ్చారు.



# ఘనంగా ఉగాది సంబరాలు



జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో
పంచాంగ పఠనం చేస్తున్న పురోహితులు

**ఎమ్మిగనూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):** ఎమ్మిగనూరు పట్టణంలో ఆదివారం తెలుగు సంవత్సరాది ఉగాది సంబరాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వేకువజామునే ఇళ్లలో పూజలు చేసుకొని గ్రామదేవతలైన సుంకులమ్మ అవ్వదేవి, మారెమ్మవ్వ దేవి ఆలయాలకు వెళ్లి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పట్టణంలోని నీలకంటేశ్వర స్వామి, ఎదురుబసమన్న ఆలయం, మార్కండేయ స్వామి, వీరభద్రేశ్వర స్వామి, గజ్జలమ్మ, వీరనాగమ్మ, సుశీలమ్మ, ఆంజనేయ స్వామి, వీవర్స్ కాలనీలోని రామలింగేశ్వర స్వామి, గాయత్రిదేవి ఆల యం, వెంకటేశ్వర స్వామి, వజ్ర ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రజలు ప్రత్యేకపూజలు చేసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆయా ఆలయాల దగ్గర చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. వీవర్స్ కాలనీ ఆంజనేయస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణతో అలంకరించారు. ఆయా ఆలయాల దగ్గర ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

**ఎమ్మిగనూరు రూరల్/పెద్దకడుబూరు:** ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు మండలాల్లో ఆదివారం ఉగాది ఉత్సవాలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మిగనూరు మండలంలోని సిరాలదొడ్డి, రాళ్లదొడ్డి, కడిమెట్ల, కడివెళ్ల, పార్లపల్లి, గువ్వలదొడ్డి, కె.తిమ్మాపురం తదితర గ్రామాల్లో ఉగాది ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో వెలసిన దేవతామూర్తులకు ఉదయం నుండే ప్రజలు నైవేద్యాలు సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. అలాగే పెద్దకడుబూరు మండలంలోని దొడ్డిమేకల, మేకడోన, తారాపురం, కల్లుకుంట, మేకడోన, నౌలేకల్లు తదితర గ్రామాల్లో ప్రజలు ఉగాది సంబరాలు అంబరంగా జరుపుకున్నారు. తారాపురం గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి మండలంలోని ప్రజలేగాక కర్ణాటక నుండి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

**కౌతాళం:** మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గాలో విశ్వవసు నామ సంవత్సరం ఉగాది పర్వదినం ఆదివారం రోజున పంచాంగ పఠనం కౌతాళం బ్రహ్మణ పురోహితులు చేపట్టారు. దర్గా ధర్మకర్త పెద్ద మున్నా పాష, పురోహితులు బద్రీనాథ్ స్వామి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే హిందూ, ముస్లింల ఐక్యతకు నిదర్శనంగా తమ వంశస్థుల ఆచారం ప్రకారం ప్రతి ఏడాది నూతన సంవత్సరం ఉగాది పర్వదినాన పురోహితులు దర్గాకు వచ్చి పంచాంగ పఠనం చేసిన తరువాతనే స్వామి వారికి ప్రత్యేక ఫాతెహలను నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది కూడా ముందుగా స్వామి వారి రాశి చక్రం ప్రకారం పంచాంగ పఠనం చేసి తరువాత దర్గా ధర్మకర్త, పీఠాధిపతుల రాశులను గురించి పురోహితులు తెలిపారు. అనంతరం స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేపట్టారు. ఎక్కడా దర్గాలో పంచాంగ పఠనము సందర్భాలు లేవని ఇక్కడ మాత్రం హిందూ, ముస్లింలు కలిసి పంచాంగ పఠనం చేయడం మతసామరస్యానికి ప్రతీకగా చెప్పవచ్చు.

● కౌతాళం మండలంలోని లక్ష్మీనగర్ క్యాంపులో ఆదివారం లక్ష్మవ్వ రథోత్సవం భక్తుల సమక్షంలో ఘనంగా జరిగింది. ప్రతి సంవత్సరం ఉగాది పర్వదినం రోజు అమ్మవారి రథోత్సవ కార్యక్రమం కొనసాగుతుంది. ముందుగా ఉదయం తెల్లవారుజామున అమ్మవారి మూలవిరాట్‌ను వెండి అలంకరణ చేపట్టి అమ్మవారికి ఆకు పూజతో పాటు ప్రత్యేక పూజలు చేపట్టి భక్తులక దర్శనం కల్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం భక్తుల సమక్షంలో అమ్మవారి రథోత్సవం ముందుకు సాగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కౌతాళం సీఐ అశోక్ కుమార్ గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**కోసిగి:** కోసిగితో పాటు అన్ని గ్రామాల్లో ఉగాది పండుగ వేడుకలు భక్తులు ఘనంగా నిర్వహించారు. కోసిగిలోని ఆంజనేయస్వామి (కోసిగయ్య) దేవాలయం, రేణుకా ఎల్లమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచే భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. కోసిగయ్య గుడిలో సాయంత్రం పురోహితుల ఆధ్వర్యంలో పంచాంగ పఠనం చేశారు. రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ చేశారు. అలాగే కాళికాదేవి ఆలయంలో భక్తులు ప్రత్యేకపూజలు చేసి సాయంత్రం ఉచ్చయి లాగి భక్తులు పూజలు చేశారు. వందగల్లు గ్రామంలో కృష్ణావదూత మఠంలో ప్రత్యేక పూజలు చేసి పీఠాధిపతి మర్రిస్వామి తాతకు తులాభారం చేశారు.

**గోనెగండ్ల:** మండల కేంద్రమైన గోనెగండ్లతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు, మహిళలు ఉదయం నుంచి ఆయా గ్రామాల్లోని సీతారామదేవాలయం, సుంకులా పరమేశ్వరి, మారెమ్మంబా దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వావసు నామ సంవత్సరం ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కోరుతూ గ్రామ పెద్దలు దేవాలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే చింతాముని నల్లారెడ్డి దేవాలయంలో ఉదయం నుంచి భక్తులు పూజా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తులసీ అర్చన, ఆకుపూజ, మహా మంగళహారతి పల్లకి సేవ నిర్వహిచారు. అలాగే శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో విశ్వబ్రాహ్మనులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోనెగండ్లతో పాటు గాజులదిన్నె, హెచ్ కైరవాడి, కులుమాల, వేముగోడు, పుట్టపాశం, బైలుప్పల, అగ్రహారం, అలువాల గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం గోనెగండ్లలో ఆంజనేయస్వామి దేవాలయం నుంచి ఈశ్వరదేవాలయం వరకు ప్రభోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవ కార్యక్రమంలో కోలాటలు, పాటలు ప్రజలకు ఎంతో ఆకట్టుకున్నాయి. వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్యస్వామి పల్లకోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు డిప్యూటీ తహసీల్దార్ గురురాజారావు, భాస్కర్ రెడ్డి, గోవిందు, దొరబాబు, శివరాముడు, కురాకులు సురేష్‌బాబు, యువకులు, గ్రామ పెద్దలు, భక్తులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

● గోనెగండ్లలో ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామంలో మారెమ్మ, సుంకులాపరమేశ్వరి దేవి దేవరను భక్తులు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి మేళతాళలతో పూర్ణకుంభాలతో అమ్మవారికి వందలాది మంది భక్తులు నైవేద్యం సమర్పించారు. ఆదివారం తెల్ల వారుజామున మారెమ్మ అమ్మవారికి బలిని సమర్పించారు. అంతకుముందు మారెమ్మ, సుంకులమ్మ దేవాలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలకంరించారు.

**మంత్రాలయం:** మండలంలోని బూదూరు గ్రామంలో వెలసిన లక్ష్మమ్మ దేవత మహా రథోత్సవం అంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఉగాది పర్వదినం పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం లక్ష్మమ్మ ఆలయ కమిటి నిర్వాహకుల ఆధ్వర్యంలో రథాన్ని గ్రామలంలో ఊరేగించారు. రథం ముందు కోలాట నృత్యాలు, భీరప్పడోళ్లు, మంగళవాయిధ్యాలు, టపాకాయలు పేలుస్తూ అమ్మవారి రథం ఊరేగించారు. అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి బంగారు, వెండి, పట్టుచీరతో చూడముచ్చటగా అలంకరించిన దృశ్యం భక్తులను ఆకట్టుకుంది. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున రెడ్డి, సుధాకర్ రెడ్డి, నరసరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● మంత్రాలయంల మండలంలోని చిలకలడోన గ్రామంలో ఆంజనేయస్వామి, రామలింగేశ్వరస్వామి ప్రభోత్సవం భక్తులకు ఆకట్టుకుంది. ఈ ప్రభోత్సవంలో స్వామివారి ప్రతిమలను ఏర్పాటు చేసి గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులోని వీవర్స్ కాలనీ ఆంజనేయస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



బూదూరులో లక్ష్మమ్మ రథోత్సవానికి హాజరైన భక్తులు



కౌతాళంలో..



గోనెగండ్లలో ప్రభోత్సవం



ఎమ్మిగనూరులో రామలింగేశ్వర స్వామికి పూజలు చేస్తున్న పూజారి, ప్రత్యేక అలంకరణలో సుంకులమ్మ



గోనెగండ్లలో అమ్మవారికి కుంభాలు తీసుకెళ్తున్న భక్తులు



కోసిగిలో పూజలందుకుంటున్న ఆంజనేయ స్వామి



విద్యుత్ దీపాలంకరణలో వీవర్స్ కాలనీ ఆంజనేయస్వామి ఆలయం

## ఆస్తిపన్ను వసూలుకు ప్రత్యేక కౌంటర్లు

**ఎమ్మిగనూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):** ఆస్తిపన్ను, నీటి పన్ను వసూళ్లకు మార్చి చివరి రోజులు కావటంతో పన్ను వసూళ్లకు ఉగాది రోజుకూడా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. దీంతో ఎమ్మిగనూరు పురపాలక సంఘంలో ఉగాది పండగరోజు పన్ను చెల్లించేందుకు ప్రత్యేక కౌంటరు ఏర్పాటు చేశారు. ఉదయం 9గంల నుంచి సాయంత్రం 7గంల వరకు ఆస్తిపన్ను, నీటి పన్ను కట్టించుకున్నారు. ప్రభుత్వం ఆస్తిపన్ను వడ్డీపై శాతం రాయతీ ఇవ్వడంతో ప్రజలు మున్సిపాలిటీకి చెల్లించాల్సిన పన్ను బకాయిలను చెల్లించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దాదాపు రూ. 5లక్షలు వరకు వసూలైనట్లు మున్సిపల్ సిబ్బంది తెలిపారు. సోమవారం రంజాన్ పండుగ ఉన్నప్పటికీ పన్నులు చెల్లించేందుకు మున్సిపాలిటిలో ప్రత్యేక కౌంటర్ కొనసాగనుంది. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని పన్నులు చెల్లించి వడ్డీ రాయతీ పొందాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి కోరారు.

## ఘనంగా గిరక లాగుడు పోటీలు

**కోసిగి, మార్చి 30(ఆంధ్రజ్యోతి):** మండల పరిధిలోని సజ్జల గుడ్డం గ్రామంలో ఉగాది పండుగ పురస్కరించుకుని వీవీఎస్ యూత్ అధ్వర్యంలో ఎద్దుల గిరకలాగుడు పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో 13 జతల ఎద్దులు పాల్గొనగా.. బోయ సూగూరు నరసింహులకు చెందిన ఎద్దులు విజేతగా నిలిచి మొదటి బహుమతి రూ.15,116 కైవసం చేసుకోగా.. యూత్ సభ్యులు నగదును అందజేశారు. అలాగే మిగతా స్థానాల్లో గెలుపొందిన ఎద్దుల యజమానులకు నగదు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు గర్జప్ప, హనుమంతరెడ్డి, భీమేష్, సూర్యప్రకాష్, సిద్ద రమేష్, వెంకటేశ్, నరసప్ప భీమిరెడ్డి రైతులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి విరాళం

**కౌతాళం, మార్చి 30(ఆంధ్రజ్యోతి):** ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం వద్ద నూతనంగా నిర్మించిన లక్ష్మీ అమ్మ వారి ఆలయ అభివృద్ధికి ఆదివారం ఓ భక్తుడు రూ.50వేల నగదును విరాళంగా అందజేశారు. ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈవో విజయరాజు మాట్లాడుతూ అమ్మవారి ఆలయ అభివృద్ధికి ఆదోని పట్టణానికి చెందిన విజయలక్ష్మి, ఈరన్న దంపతులు రూ.50వేల నగదును దేవస్థానం కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు. వీరి వెంట ఆలయ ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి ఉన్నారు.

## రంజాన్ కిట్ల పంపిణీ

**ఎమ్మిగనూరు టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని తేరు బజారులో ఉన్న మీనామసీదులో ఎస్‌డీపీఐ అధ్వర్యంలో రంజాన్ కిట్లను పేదలకు పంపిణీ చేశారు. ఆదివారం మసీదులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న చేతుల మీదుగా పేద ప్రజలకు బియ్యం, బ్యాలు,షెమియాలు, బెల్లం, బట్టలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌డీపీఐ పట్టణ అధ్యక్షులు హుసేన్ బాషా, మసీదు ముతవల్లి వాహిద్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటికి సమస్య లేదు

- జీడీపీలో 1.4 టీఎంసీల నీరు
- ఏప్రిల్ 10 వరకు ఆయకట్టు భూములకు సాగునీరు

**గోనెగండ్ల, మార్చి 30(ఆంధ్రజ్యోతి):** ఈ వేసవిలో ఎండల మండిపోతున్నాయి. గాజులదిన్నె ప్రాజెక్టులో ప్రస్తుతం 1.4 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. అయితే అధికారులు మాత్రం ఈ వేసవిలో ప్రాజెక్టు కింద ఉన్న తాగునీటి పథకాలకు నీటి సమస్య లేదని జీడీపీ ఇరిగేషన్ అధికారులు తెలుపుతున్నారు. ప్రస్తుతం జీడీపీలో నీటిమట్టం 2.1(గ్రాస్), (1.4లైవ్)టీఎంసీల నీరు ఉన్నట్లు తెలుస్తుంది. ఎండలు పెరిగే కొద్ది ప్రాజెక్టు నీరు అవిరి రూపంలో రోజుకు 30 నుంచి 35 క్యూసెక్కుల నీరు అవిరి అవుతున్నట్లు తెలుస్తుంది. జీడీపీ ఆయకట్టు కిందా 13వేల ఎకరాలు సాగు చేశారు. పంటలు పూర్తి గా చేతికి అందాలంటే మరో పది రోజులు నీరు ఇవ్వాలని రైతులు అధికారులను కోరగా ఇందుకు సానుకూలంగా స్పందించి ఏప్రిల్ 10 వ తేదీ వరకు జీడీపీ కింద ఉన్న ఆయకట్టు భూములకు సాగు నీరు విడుదల చేయనున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలుపుతున్నారు. ఏప్రీల్, మే నెలలలో ఎండతీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీంతో జూన్, జూలై నెల వరకు తాగునీటి పథకాలకు ఇబ్బంది ఉంటుందా లేదా అన్నది స్పష్టంగా చెప్పలేము. గాజులదిన్నె ప్రాజెక్టు కింద బండగట్టు, డోన్, క్రిష్ణగిరి నీటి పథకాల కింద దాదాపు 120 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుంది. అయితే అవసర సమయంలో కర్నూలు, కోడుమూరు, గూడురు, బెళగల్, నగరాలకు తాగునీటి కోసం అధిక నీటిని తరలిస్తే కొంత ఇబ్బందిగా మారచ్చని తెలుస్తోంది.



జీడీపీలో నిల్వ ఉన్న నీరు

## బంగారు అంబారిపై ప్రహ్లాదరాయలు



బంగారు అంబారిపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

**మంత్రాలయం, మార్చి 30(ఆంధ్రజ్యోతి):** రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు బంగారు అంబారిపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆదివారం ఉగాది పాడ్యమి శుభదినాన్ని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచే రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి, మంచాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణాలు, మంగళ వాయిద్యాల మధ్య వెండి గజవాహనంపై స్వర్ణ అంబారిలో ప్రహ్లాదరాయలను అధిష్టించి పీఠాధిపతి మహామంగళహారతితో ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు.

## ఘనంగా తిమ్మప్పస్వామి పల్లకోత్సవం

**ఎమ్మిగనూరు రూరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి):** మండలంలోని రాళ్లదొడ్డి గ్రామంలో వెలసిన చెరుకురాళ్ల తిమ్మప్పస్వామి పల్లకోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉగాది పండుగను పురస్కరించుకొని గ్రామ శివార్లలో కొండపై వెలసిన చెరుకురాళ్ల తిమ్మప్ప స్వామికి ఉదయం నుంచే ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సంధ్యావేళలో గ్రామంలోని శివాలయం నుంచి కొండపై వెలసిన చెరుకురాళ్ల తిమ్మప్పస్వామి దగ్గరకు పల్లకోత్సవాన్ని తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

## 'సమస్యలు అడిగితే అక్రమ కేసులు పెడతారా'

**పెద్దకడుబూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి):** ప్రజా సమస్యలపై అధికారులను అడిగితే అక్రమ కేసులు పెడతారా అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి వీరేష్, ఏఐవైఎఫ్ నాయకులు జాఫర్‌లు ప్రశ్నించారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై సీపీఐ పోరాటం చేస్తుందని, నిర్భయంగా అధికారులను నిలదీస్తుందని తెలిపారు. పెద్దకడుబూరు గ్రామానికి చెందిన తిక్కమ్మ గత నాలుగు మాసాల నుంచి గ్రామంలో ఉన్న తన స్థలానికి పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాని తిరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదన్నారు. ఈసమావేశంలో మబ్బు ఆంజనేయులు, తిక్కన్న, నరసింహులు, రవి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.